

పత్తికి జీవం

- జిల్లా వ్యాప్తంగా వర్షం
- పత్తి రైతుల హర్షం
- జిల్లాలో 20 వేల ఎకరాల్లో పత్తి విత్తనాలు
- వానాకాలం సాగు అంచనా 2.42 లక్షల ఎకరాలు
- జిల్లా కేంద్రంలో 35.3 మి.మీ వర్షపాతం నమోదు



సిరిస్లిల పాతబస్టాండ్‌లో జలమయమైన రోడ్డు



వేములవాడలో వర్షం

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

చిరుజల్లుల కోసం ఎదురు చూస్తున్న జిల్లా రైతులు, ప్రజలకు ఊరటనిస్తూ వాన పలకరించింది. ముఖ్యంగా పత్తి విత్తనాలు వేసుకొని నిరీక్షిస్తున్న రైతుల్లో సంతోషాన్ని నింపింది. పత్తికి జీవం పోసినట్లయ్యిందని అన్నదాతలు భావిస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా కాలాన్ని గుర్తు చేస్తూ వర్షం కురవడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. రైతులు వానాకాలం సీజన్‌సాగు పనులు ముమ్మరం చేయడానికి సిద్ధమయ్యారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో 35.3 మిల్లీమీటర్ల వర్షం కురవగా వేములవాడలో 11.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతోపాటు జిల్లాలోని మండలాల్లో మోస్తరు వర్షపు జల్లులు పడ్డాయి. సిరిసిల్లలో రోడ్లు జలమయమయ్యాయి. కార్మిక వాడల్లో రోడ్లపై నీరు ప్రవహించింది.

అన్నదాతల్లో ఆశలు

వానాకాలం సీజన్ ప్రారంభంలోనే వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని భావించి రైతులు సాగుకు సన్నద్ధమయ్యారు. వర్షాలు లేక వరి నాట్లు మొదలు కాలేదు. ముందస్తుగా వేసుకున్న పత్తి విత్తనాలు మొలక లేక వర్షాల కోసం అన్నదాతలు ఎదురు చూశారు. జిల్లాలో వానాకాలం సీజన్‌లో 2.42 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తారని అంచనా వేశారు. ఇందులో ప్రధానంగా వరి లక్షా 83 వేల 080 ఎకరాలు, పత్తి 49,215 ఎకరాలు వేయడానికి సిద్ధమయ్యారు. ఇందులో ఇప్పటికే పత్తికి సంబంధించి 20,410 ఎకరాల్లో విత్తనాలు వేసుకున్నారు. వర్షాలు లేకపోవడంతో భూమిలో తేమ శాతం తగ్గిపోయి విత్తనాలు మొలకెత్తకపోవడం రైతులను కలవరపెట్టింది. ఈ పరిస్థితులు ఇలాగే కొనసాగితే భారీగా నష్టపోతామని పత్తి రైతులు ఆందోళన చెందారు. ఈ క్రమంలో శుక్రవారం కురిసిన వర్షం మళ్లీ ఆశలు కల్పించింది. జిల్లాలో ఇప్పటి వరకు పత్తి విత్తనాలను ఇల్లంతకుంటలో 8 వేల ఎకరాలు, గంభీరావుపేట 10, ముస్తాబాద్ 30, సిరిసిల్ల 150, తంగళ్లపల్లి 200, వీర్నపల్లి 50, ఎల్లారెడ్డిపేట 600, బోయినపల్లి 2800, చందుర్తి 2500, కోనరావుపేట 2 వేలు, రుద్రంగి 850, వేములవాడ 2200, వేములవాడ రూరల్‌లో 1020 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. వర్షాలు లేకపోవడంతో వరినాట్లు ఇప్పటి వరకు మొదలు కాలేదు. జిల్లాలో 1.83 లక్షల ఎకరాల్లో వరితో పాటు మొక్కజొన్న 1510 ఎకరాలు, కందులు 1502, పెసర 348, ఇతర పంటలు 599, ఉద్యాన పంటలు 6900 ఎకరాలు సాగు చేస్తారని అంచనా వేశారు. ఇప్పటి వరకు 36,360 ఎకరాల్లో పంటలు చేశారు. వరినాట్ల కోసం 2425 ఎకరాల్లో నారుమడులను కూడా సిద్ధం చేశారు. పెసర 15 ఎకరాలు, కందులు 22 ఎకరాలు, మొక్కజొన్న 243 ఎకరాల్లో వేశారు. వర్షాలు మొదలు కావడంతో రైతులు వ్యవసాయ పనుల వైపు దృష్టిసారించారు

మహిళలను కోటీశ్వరులుగా చేయాలి



సిరిసిల్లలో మాట్లాడుతున్న డీఆర్‌డీవో శేషాద్రి

సిరిసిల్ల కలెక్టరేట్, జూన్ 21 : మహిళలను కోటీశ్వరులుగా తయారు చేసేందుకు కృషి చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శేషాద్రి కోరారు. సిరిసిల్ల పట్టణంలోని జిల్లా మహిళా సమాఖ్య సంఘం భవనంలో శుక్రవారం మహిళా శక్తి కార్యక్రమాన్ని జిల్లా స్థాయిలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో శేషాద్రి మాట్లాడుతూ రాబోయే ఐదు సంవత్సరాల్లో లక్ష కోట్లను ఎస్‌హెచ్‌జీలకు లింక్ చేయాలని ఇందులో రూ 25 కోట్లు వ్యాపారాభివృద్ధి కోసం వినియోగించుకోవాలని అన్నారు. సంఘాల్లో లేని మహిళలను సభ్యులుగా చేర్పించేందుకు ముందుకురావాలన్నారు. సభ్యురాలికి రూ.2లక్షల బీమా సౌకర్యం (స్త్రీనిధి)తోపాటు రూ. 10లక్షల ప్రమాద బీమా వర్తిస్తాయన్నారు. వ్యాపారాలకు సంబంధించి నైపుణ్యాలను, మార్కెటింగ్ స్కిల్స్ డెవలప్ చేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో అడిషనల్ డీఆర్‌డీవో శ్రీనివాస్, డీపీఎంలు, ఏపీఎంలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చందుర్తి, జూన్ 21 : కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామంలోని 132/33 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతు కారణంగా సనుగుల సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు సెస్ ఏఈ మహేష్ శుక్రవారం తెలిపారు. మండలంలోని సనుగుల, దేవునితండ, లింగంపేట్, కిష్టంపేట, రామరావుపల్లి గ్రామాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

జాతీయ స్థాయికి ఎంపికైన పవర్‌లూం క్లాత్‌ఫోల్డింగ్ మిషన్

సిరిసిల్ల రూరల్, జూన్ 21 : ఎగ్జిబిట్ ఇన్‌స్పైర్ మానాక్‌లో తయారు చేసిన పవర్‌లూం క్లాత్ ఫోల్డింగ్ మిషన్ జాతీయ స్థాయికి శుక్రవారం ఎంపిక చేశారు. సిరిసిల్ల పట్టణంలోని శివనగర్ కుసుమ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి జక్కని హేమంత్, గైడ్ టీచర్ పాకాల శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో మిషన్ తయారు చేశారు. నేతన్నల కష్టాలను చూసిన హేమంత్ వారి కష్టాలకు పరిష్కారం చూపే దిశగా మిషన్‌ను తయారు చేశారు. జాతీయ స్థాయికి ఎంపిక కావడంతో హేమంత్, గైడ్ టీచర్ పాకాల శంకర్‌గౌడ్‌ను డీఈవో రమేష్‌కుమార్, జిల్లా సైన్స్ అధికారి పాముల దేవయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లకావత్ మోతిలాల్ అభినందించారు.



మిషన్‌తో విద్యార్థి

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, జూన్ 21: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పకడ్బందీ చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్పష్టం చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చేపడుతున్న చర్యలపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖల ఉన్నతాధికారులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలోని అన్ని గ్రామాలు, మున్సిపాలిటీల్లో పారిశుధ్య పనులకు ప్రణాళిక సిద్ధం చేయాలని, మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని అన్నారు. మంగళ, శుక్రవారాల్లో డ్రైడే పాటించాలని సూచించారు. జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లలో దోమల నివారణకు మందు స్ప్రే చేయాలని, పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థుల సంరక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రార్థన సమయంలో డెంగ్యూ, మలేరియా వ్యాధులు, నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు గతేడాది సీజనల్ వ్యాధులు ఎక్కడ ప్రబలాయో ఆయా చోట్ల ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని మందులు అందుబాటులో ఉంచాలన్నారు. అన్ని శాఖల ఉన్నతాధికారులు సమన్వయంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, డీఆర్డీవో శేషాద్రి, డీపీవో వీర బుచ్చయ్య, డీఎంహెచ్‌వో సుమన్ మోహన్ రావు, డీఈవో రమేష్ కుమార్, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు లావణ్య, అన్వేష్, జడ్పీ డిప్యూటీ సీఈవో గీత, డీడబ్ల్యూవో లక్ష్మీరాజం, మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ విజయ్ కుమార్, ఇంట్రా ఈఈ జానకి, మత్స్య శాఖ అధికారి శివప్రసాద్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ మోహన్ రెడ్డి, ఎస్సీ వెల్ఫేర్ ఆఫీసర్ వినోద్ కుమార్, మైనారిటీ కార్యాలయ ఓఎస్డీ సర్వర్ మియా, తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: రోగులకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. కోనరావుపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో మందులు అందజేసే గది, పరీక్షలు చేసే ల్యాబ్, ఇన్ పేషెంట్ వార్డులను పరిశీలించారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ నెలలో ఇప్పటి వరకు 24 మంది డెలివరీ అయ్యారని మెడికల్ ఆఫీసర్ కలెక్టర్‌కు వివరించారు. అవసరమైన మందులు సరిపడా అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండేలా చూడాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అన్ని రకాల రక్త పరీక్షలు చేస్తూ, అందుబాటులో ఉండాలని ఆదేశించారు. వైద్యాధికారి వేణు మాధవ్, తహసీల్దార్ విజయ్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్‌ను అగ్రభాగాన నిలపాలి



సిరిసిల్లలో మాట్లాడుతున్న కేటీఆర్

సిరిసిల్ల, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): సహకార రంగంలో సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ ఎంతో విలక్షణమైందని, రాష్ట్రంలోనే 47 బ్యాంకుల్లో సిరిసిల్ల బ్యాంక్‌ను అగ్రభాగాన నిలపాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కే తారకరామారావు అన్నారు. శుక్రవారం సిరిసిల్లలోని పద్మశాలి కల్యాణ భవనంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సిరిసిల్ల సహకార అర్బన్ బ్యాంక్ పాలకపగ్గాలను దక్కించుకున్న సందర్భంగా అభినందన సభ నిర్వహించారు. చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ అడ్డగట్ల మురళి, డైరెక్టర్లు గుడ్ల సత్యానంద్, పాటి కుమార్‌రాజు, బుర్ర రాజు, వేముల సుక్కమ్మ, అడ్డగట్ల దేవదాస్, ఎనగందుల శంకర్, వరుస హారిణి, కోడం సంజీవ్‌ను కేటీఆర్ సన్మానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ అర్బన్ బ్యాంక్ అగ్రభాగాన నిలవాలంటే తీసుకున్న రుణాలు చెల్లించాలని, ఖాతా దారుల నుంచి డిపాజిట్లు సేకరించాలని అన్నారు. లోక్‌సభ ఎన్నికల మాదిరిగా బ్యాంక్ ఎన్నికలు హోరాహోరీగా సాగినా ఎంతో కష్టపడి పని చేసినందుకు అభినందిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఎన్నికలు లేవని, మున్సిపల్ కౌన్సిల్ ఎన్నికలు వచ్చినప్పుడు మళ్లీ కొట్లాడుకోవచ్చని బ్యాంక్ అభివృద్ధికి కష్టపడి పనిచేయాలని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాలు ఉన్నాయని, జిల్లా మంత్రితోపాటు కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ సహకారం కూడా తీసుకోవాలని, బ్యాంక్ అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. బ్యాంక్ పాలకవర్గంలో ఇతర సభ్యులను కూడా కలుపుకొని పనిచేయాలన్నారు. బ్యాంక్ అభివృద్ధికి తనవంతు సహకారాన్ని అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, టెక్స్‌టైల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బ్యాంక్ మాజీ అధ్యక్షుడు గాజుల నారాయణ, దార్నం లక్ష్మీనారాయణ, గాజుల బాలయ్య, గడ్డం విఠల్, పద్మశాలి భవన్ అధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీనివాస్, యువజన సంఘం అధ్యక్షుడు పూర్ణచందర్, బీఆర్ఎస్ నాయకులు బొల్లి రామ్మోహన్, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల తనిఖీ



కళాశాలను పరిశీలిస్తున్న కలెక్టర్

సిరిసిల్ల, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): రెండో బైపాస్ రోడ్డులోని సిరిసిల్ల ప్రభుత్వ మెడికల్ కళాశాలను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా శుక్రవారం తనిఖీ చేశారు. అనాటమీ, ఫిజియోలాజీ, బయో కెమిస్ట్రీ ల్యాబ్‌లను పరిశీలించారు. కళాశాలలో ఏమైనా ఇబ్బందులు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకరావాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్‌కు సూచించారు. అనంతరం కళశాలలో చదువుతున్న విద్యార్థులు, బోధిస్తున్న అధ్యాపకుల వివరాలను తెలుసుకున్నారు.

ప్రగతి పనులను పూర్తి చేయాలి

సిరిసిల్ల కలెక్టరేట్, జూన్ 21 : జిల్లాలో ప్రగతిలో ఉన్న పనులను త్వరి తగతిన పూర్తిచేయాలని ఆర్అండ్‌బీ అధికారులను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆర్అండ్‌బీ అధికారులతో జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న పనుల పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు. జిల్లాలో ప్రగతిలో ఉన్న పలు వంతెనలు, రోడ్ల నిర్మాణాల వివరాలు తెలుసుకున్నారు. వర్షాకాలం నేపథ్యంలో వరదల రాక పోకలకు అంతరాయం తలెత్తకుండా మరమ్మతులు చేపట్టాలన్నారు. వంతెనలు, రోడ్లు నిర్మించాల్సి ఉంటే మంజూరు కోసం ప్రతిపాదనలను పంపాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్అండ్‌బీ ఈఈ శ్యామ్‌సుందర్, డీఈఈ శాంతయ్య, ఏఈలు కిరణ్, సతీష్, నరేందర్ పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల్లో వేగం పెంచాలి



వివరాలు తెలుసుకుంటున్న అడిషనల్ కలెక్టర్ గౌతమి

ఎల్లారెడ్డిపేట, జూన్ 21: అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను వేగవంతం చేయాలని అడిషనల్ కలెక్టర్ పూజారి గౌతమి సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఎల్లారెడ్డిపేట మండలం పదిర, అల్మాస్‌పూర్ గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో కొనసాగుతున్న పనులను శుక్రవారం పరిశీలించారు. పాఠశాలల్లో పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నాణ్యతతో కూడిన పనులను చేయాలని సూచించారు. సకాలంలో పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకు రావాలని ఆదేశించారు. పనుల ప్రగతిపై పలు సూచనలు చేశారు. డీఈవో రమేశ్‌కుమార్, ఎంపీడీవో సత్తయ్య, వివిధ శాఖల అధికారులు, పాఠశాలల హెచ్‌ఎంలు ఉన్నారు.

స్పోర్ట్స్ అకాడమీల్లో ప్రవేశాలకు నైపుణ్య పరీక్షలు

సిరిసిల్ల టౌన్, జూన్ 20: తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ 2024 - 25 విద్యా సంవత్సరానికి రీజనల్ స్పోర్ట్స్ అకాడమీల్లో ప్రవేశాలకు నైపుణ్య పరీక్షలుంటాయని శుక్రవారం జిల్లా యువజన, క్రీడల అధికారి అజ్మీరా రాందాస్ తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు జూలై 3, 4వ తేదీల్లో ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్లతో ఆయా రీజనల్ స్పోర్ట్స్ అకాడమీల్లో హాజరుకావాలని పేర్కొన్నారు. వివరాలకు 9440239783 నంబరులో సంప్రదించాలని సూచించారు.

విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యం పెంచాలి



డీఈవోను సన్మానిస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, జూన్ 20: విద్యార్థులలో క్రీడా నైపుణ్యం పెంచి సర్వతోముఖాభివృద్ధికి వ్యాయామ ఉపాధ్యాయులు తోడ్పడాలని జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్ అన్నారు. పీడీ(వ్యాయామ ఉపాధ్యాయులు)ల పదోన్నతుల ప్రక్రియలో ఆటంకాలు లేకుండా పూర్తి చేసినందుకు శుక్రవారం వ్యాయామ ఉపాధ్యాయులు, టీజీ పేట నాయకులు మర్యాద పూర్వకంగా కలసిని ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువులకే పరిమితం కాకుండా క్రీడల్లోనూ రాణించాలన్నారు. టీజీపేటా జిల్లా అధ్యక్షుడు రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్, పీడీలు శ్యాంసుందర్, పర్శరాములు, శ్రీనివాస్, రాజశేఖర్, నరేష్, అజయ్ పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ టౌన్, జూన్ 21 : వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి ఆలయంల శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులు ఆయా క్యూలైన్‌లలో ఆలయంలోకి ప్రవేశించి శ్రీస్వామి వారిని దర్శించుకున్నారు. కోడెమొక్కులు చెల్లించుకుని అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలో పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలో దళితుల సంక్షేమానికి పెద్దపీట

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్



అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కేటీఆర్

ఎల్లారెడ్డిపేట, జూన్ 21: బీఆర్ఎస్ పాలనలో దళితుల సంక్షేమం కోసం పెద్దపీట వేశామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం పదిరలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ అంబేద్కర్ రాసిన రాజ్యాంగంతోనే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందన్నారు. తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో హైదరాబాద్‌కు ఎవరు వచ్చినా ఆశ్చర్యపోయేలా సచివాలయాన్ని నిర్మించామని, దేశంలో ఎక్కడా లేని విధంగా అంబేద్కర్ పేరు పెట్టుకున్నామని అన్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద అంబేద్కర్ విగ్రహాన్ని హైదరాబాద్ నడిబొడ్డున ఆవిష్కరించుకున్నామన్నారు. దళితులను ధనవంతులను చేయాలనే చిత్తశుద్ధితో దళితబంధు పథకం ప్రవేశ పెట్టి రూ.10 లక్షలు అందించామన్నారు. దళితులకు ఇచ్చిన హామీ 'అంబేద్కర్ అభయ హస్తం'కు తగిన నిధులు కేటాయించి ఓట్ల కోసమే కాదని నిరూపించుకోవాలన్నారు.

సిరిసిల్ల పక్కనే పదిరకు చెందిన దళితులు దళితబంధు పథకం కింద రూ.90 లక్షలతో పెట్రోల్ బంకు, దుమాలలో ముగ్గురికి రూ.30 లక్షల ప్రభుత్వం ఇస్తే రూ.3 కోట్లతో విజయ లక్ష్మీ ఇండస్ట్రీస్ రైస్ మిల్లు నెలకొల్పారని, అదీ రాష్ట్రానికే గర్వకారణమైందని అన్నారు. గండిలచ్చపేటలో ఇద్దరు మినీ పౌల్ట్రీ ఫాం పెట్టారన్నారు. అంతకుముందు ఆచార్య జయశంకర్ వర్ధంతి సందర్భంగా చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘం అధ్యక్షుడు పెద్ది ఎల్లయ్యతో కలిసి జెండాను ఎగుర వేశారు. దళిత సంఘం నాయకులు అంబేద్కర్ చిత్ర పటాన్ని కేటీఆర్‌కు బహూకరించారు. జడ్పీ చైర్మన్ అరుణ, జడ్పీటీసీ లక్ష్మణ్ రావు, ఎంపీపీ రేణుక, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, ఎంపీటీసీ మల్లేశం, మండల కో-ఆప్షన్ సభ్యులు జబ్బార్, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, దళిత సంఘాల నాయకులు భాను, రమేశ్, చంద్రయ్య, లక్ష్మణ్, శంకర్, సతీష్, రాజు, రాజయ్య దాసు, దేవరాజు, భూమరాజయ్య, నర్సింలు, నాగరాజు, రాజుకుమార్, లక్ష్మణ్, మహేశ్, ఎల్లవ్వ, నాయకులు మల్లారెడ్డి, సుభాష్, నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సందీప్, రమేశ్, శ్రీనివాస్, సీత్యానాయక్, శివరామకృష్ణ, మజీద్ పాల్గొన్నారు.

- పదిరలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడేందుకు నిర్వాహకులు మౌత్‌పీస్‌ను అందజేశారు. ప్రసంగించేందుకు సిద్ధమతున్న క్రమంలో కరెంటు పోవడంతో.. 'కాంగ్రెస్ వచ్చింది.. కరెంటు పోయింది' అని పేర్కొని కిందకు దిగారు. జెండావిష్కరణ తర్వాత మాట్లాడుతున్న తరుణంలో పలుమార్లు కరెంటు పోవడంతో 'ఇట్లుందీ కాంగ్రెస్ పాలన' అంటూ మైక్ లేకుండానే మాట్లాడారు. అక్కడే ఉన్న ఓ యువకుడు 'అన్నా మీరే కదా మా నియోజక వర్గానికి ఎమ్మెల్యే. ప్రభుత్వంతో కొట్లాడాలి' అని పేర్కొనడంతో అందరం కలిసి ఉద్యమిస్తామని కేటీఆర్ అన్నారు.

- మండలంలోని పదిరకు కేటీఆర్ వస్తున్నారనే సమాచారంతో ఆయా గ్రామాలకు చెందిన పలువురు చేరుకున్నారు. గృహలక్ష్మీ పథకం ద్వారా జీరో బిల్లు రావడంతో తమ వేతనాలు తగ్గిపోయాయని 'సెస్' పరిధిలో విధులు నిర్వహిస్తున్న 38 మంది బిల్ కలెక్టర్లు కేటీఆర్‌తో గోడు వెల్లబోసుకున్నారు. నెలకు రూ.2 వేలు చెల్లించడంతో కుటుంబాలను పోషించుకునేందుకు ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. స్పందించిన కేటీఆర్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వీర్నపల్లి మండలం బాబాయిచెరువు తండాలో తమ కూతురు బానోతు మమతను హతమార్చి ఆత్మహత్యగా చిత్రీకరించిన బావుసింగ్‌నాయక్ తండాలోని యువకుడి గుగులోతు సతీష్‌పై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, బంధువులు మొర పెట్టుకున్నారు. న్యాయం చేయాల్సిన పోలీసులు తమ పైనే కేసులు నమోదు చేశారని కన్నీళ్ల పర్యంతమయ్యారు. ఆయా గ్రామాలకు చెందిన పలువురు తమ సమస్యలను తీర్చాలని వినతి పత్రాలను అందజేశారు.



జయశంకర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కేటీఆర్

చికిత్స పొందుతూ యువకుడి మృతి

గంగాధర, జూన్ 21: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లికి చెందిన జలెందర్(33) అనే యువకుడు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. గురువారం రాత్రి జలెందర్ బోయినపల్లి మండలం కొదురుపాక బ్రిడ్జి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు కుటుంబ సభ్యులు కరీంనగర్‌కు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. జలెందర్ ఉపాధి నిమిత్తం దుబాయి వెళ్లి రెండు నెలల క్రితం వచ్చాడు. సోమవారం తిరిగి దుబాయి వెళ్లేందుకు విమాన టికెట్లు సైతం బుక్ చేసుకున్నాడని కుటుంబీకులు తెలిపారు. ఇంతలోనే రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

మంథని, జూన్ 21: స్థానిక పోచమ్మవాడలో ప్రమాదవశాత్తు విద్యుదా ఘాతంతో బుద్దార్తి వర్షిత్(18) యువకుడు శుక్రవారం మృతిచెందినట్లు ఎస్ఐ వెంకటకృష్ణ తెలిపారు. తన ఇంటి ముందు నిర్మించిన మరో ఇంటిలో విద్యుత్ వర్క్ చేస్తుండగా ప్రమాదవశాత్తు షాక్‌కు గురయ్యాడు. వర్షిత్‌ను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్ ధ్రువీకరించారు. తండ్రి బుద్దార్తి నవీన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ఎఫ్‌సీఐ బియ్యం బస్తాలు దొంగిలించిన ముఠా అరెస్టు

అంతర్గాం, జూన్ 21: మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో ఆగి ఉన్న ఎఫ్‌సీఐ బియ్యం బస్తాల గూడ్స్ రైలు నుంచి 30క్వింటాళ్ల బియ్యం బస్తాలు దొంగిలించి రెండు ఆటోలలో తరలిస్తున్న నలుగురు నిందితులను శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపుతున్నట్టు రామగుండం ఆర్‌పీఎఫ్ సీఐ బుర్ర సురేష్‌గౌడ్ తెలిపారు. నిందితులు గుమ్ముల భీమయ్య, జనగామ దినేష్, కనుసోతు వెంకటేష్, అన్నెల వంశీలను మంచిర్యాల పట్టణంలో పట్టుకుని వీరితో పాటు రెండు ఆటోలు టీఎస్01యూబీ7552, టీఎస్19టీఏ6109లను అదుపులోకి తీసుకున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్ ఏఎస్ఐ శేఖర్‌రెడ్డి, డీ ఐలయ్య, సుమన్, ఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీపీసీలో వ్యక్తి ఆత్మహత్య



రమేశ్(ఫైల్)

జ్యోతినగర్, జూన్ 21: ఎన్టీపీసీ అన్నపూర్ణకాలనీలో శుక్రవారం కందుల రమేశ్(53) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటి దూలానికి తాడుతో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. కుటుంబ కలహాల కారణంగా రమేష్ ఆత్మహత్యకు పాల్పడి నట్లు ఎన్టీపీసీ పోలీసులు తెలిపారు. రమేశ్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు, కొడుకు ఉన్నారు. కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్టీపీసీ పోలీసులు తెలిపారు.

యూనిసెఫ్ ప్రతినిధుల సందర్శన


తిమ్మాపూర్‌లో ఇంకుడు గుంతలను పరిశీలిస్తున్న యూనిసెఫ్ ప్రతినిధులు

తిమ్మాపూర్, జూన్ 21: తిమ్మాపూర్ గ్రామాన్ని కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మూడు రా రాష్ట్రాల యూనిసెఫ్ ప్రతినిధులు(40మంది) శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో బృందం సభ్యులు పర్యటించి పారిశుధ్యం, తాగునీరు సదుపాయాలను పరిశీలించారు. ఇళ్లల్లో తడి, పొడి చెత్త సేకరణ, వేరుచేయడం, కంపోస్ట్ తయారు చేయడం, దాన్ని అమ్మకం లాంటి వాటిని పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో నల్ల కనెక్షన్‌లు, ఇంకు డు గుంతలు, కిచెన్ గార్డెన్‌లు, టాయిలెట్లు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను, మండల వైద్య కేంద్రాన్ని పరిశీలించారు. వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీలో కంపోస్ట్ స్టాల్, స్టీల్ బ్యాంక్, శానిటరీ టూల్స్ స్టాల్, వాటర్ టెస్టింగ్, పారిశుధ్య కార్మికుల సేఫ్టీ స్టాల్, గ్రామ పంచాయతీకి వచ్చిన అవార్డులతో ఏర్పాటు చేసిన స్టాల్‌లను పరిశీలించారు. పారిశుధ్య కార్మికులకు ఇన్సూరెన్స్, పీపీఈ కిట్స్, హెల్త్ చెకప్స్‌ను పరిశీలించారు. అనంతరం సమావేశం ఏర్పాటు చేసి గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనులు బాగున్నాయని ప్రశం సించారు. కార్యక్రమంలో యూనిసెఫ్ హెచ్‌యఫ్‌వో వెంకటేష్, వాష్ కన్సల్‌టెంట్ ప్రభాత్, ఇఫి కర్ కన్సల్‌టెంట్ కాశీనాథ్, కన్సల్‌టెంట్‌లు, జిల్లా యూనిసెఫ్ కో ఆర్డినేటర్ కిషన్‌స్వామి, ఎస్ బీఎం రమేశ్, వేణు, ఎంపీడీవో విజయ్‌కుమార్, ఎంపీవో కిరణ్ కుమార్, గ్రామ పంచాయతీ కార్యదర్శి కె.మహేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కళాకారులను ప్రోత్సహించాలి


జ్యోతి వెలిగిస్తున్న ఆర్డీవో మహేశ్వర్

- సంగీత దినోత్సవంలో ఆర్డీవో మహేశ్వర్
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కరీంనగర్ కల్చరల్, జూన్ 21: కళలు అజరామరమని, కళలను, కళాకారులను ప్రోత్సహిం చాల్సిన అవసరం ఉందని ఆర్డీవో మహేశ్వర్ అన్నారు. శుక్రవారం ప్రపంచ సంగీత దినోత్సవం సందర్భంగా కరీంనగర్‌లోని ఫిలిం భవన్‌లో ప్రవీణ్ సల్వాజి మ్యూజికల్ గ్రూప్, సల్వాజి ఈవెంట్స్ సంయుక్తంగా నిర్వహించిన వేడుకకు ఆర్డీవో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భారతీయ కళలకు ఎంతో ప్రాధాన్యం ఉందని తెలిపారు. కళాకారులకు, కళలకు చేయూతని వ్వాలని, కళలతో మానసిక, శారీరక ప్రశాంతత సాధ్యమని తెలిపారు. ప్రతీ యేటా సంగీత దినోత్సవాన్ని జరుపుతూ కళాకారులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి అందరికీ పరిచయం చేస్తోన్న సల్వాజి ప్రవీణ్‌ను అభినందించారు.


నృత్యం చేస్తున్న చిన్నారులు

సీనియర్ గాయకులు నామ్‌దేవ్, బొజ్జ రేవతి, గొల్లపల్లి రవీందర్, మురళి మధు, టి మోహనస్వామి, జి కృపాదానంతో పాటు సుమారు 10 జిల్లాల నుంచి వచ్చిన కళాకారులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీనియర్ గాయ కుల పాటలతో పాటు సంగెం రాధాకృష్ణ బృందం, చిన్నారుల శాస్త్రీయ నృత్యాలు, రామకృష్ణ బృందం, విద్యార్థుల బ్రేక్ డాన్స్‌లు ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో ప్రొఫెసర్ తిరుపత య్య, అజయ్, గుండేటి రమేశ్, అనుముల దయాకర్, అభి, బాబు గౌరవేని, సల్వాజి సంధ్య, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

25 శాతం పెనాల్టీ జీవోను రద్దు చేయాలి

కరీంనగర్ టౌన్, జూన్ 21: వానాకాలం 2021-22కు సంబంధించిన రైస్ సీఎంఆర్ నిర్ణీత కాల వ్యవధిలో ఇవ్వనందున 25శాతం పెనాల్టీ విధిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోను రద్దు చేసి న్యాయం చేయాలని కరీంనగర్ రా రైస్ మిల్లర్స్, 25 శాతం పెనాల్టీ బాధితులు రాష్ట్ర పౌరసరఫరాలు, భారీ నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు పలువురు బాధితులు హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. 2021-22 వానాకాలం సీజన్‌లో సివిల్ సప్లయిశాఖ నుంచి ధాన్యాన్ని దించుకొని నిర్ణీత కాలవ్యవధిలో రైస్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ గోదాములు ఖాళీగా లేక పోవడంతో అధికారుల దృష్టికి సమస్యలను పలుమార్లు తీసుకెళ్లి విన్నవించుకున్నామని చెప్పారు. తమకు రైస్ డెలివరీ చేసేందుకు అలాట్‌మెంట్ ఇవ్వాల్సిందిగా చాలా సార్లు కోరినప్పటికీ వివిధ కారణాలను చూపుతూ అలాట్‌మెంట్ ఇవ్వలేదని అన్నారు. 2021 సంవత్సరానికి సం బంధించిన ధాన్యం ఉత్పత్తి ఎక్కువైనందున గోదాములు పూర్తిగా నిండిపోయినప్పటికీ కూడా అధికారుల ఒత్తిడి మేరకు మిల్లు ఆవరణ లోని ఖాళీ స్థలంలో ధాన్యం బలవంతంగా దించారని మంత్రికి వివరించారు. ఆ ధాన్యాన్ని కాపాడేందుకు సరైన రక్షణ చర్యలు చేపట్టినా కూడా ప్రభుత్వం నిర్ణీత కాలవ్యవధిలో బియ్యం తీసుకోకపో వడంతో ప్రకృతి వైపరీత్యాలతో కురిసిన భారీ వర్షాలకు ధాన్యం దెబ్బతిని నల్లరంగుగా మారి మొలకెత్తాయన్నారు. వానాకాలం ధాన్యం ఉండగానే యాసంగి ధాన్యం కూడా దిగుమతి చేశారని అన్నారు. ఇలా అనేక రకాలుగా రా రైస్ మిల్లర్లు ఇబ్బందులకు గురికావడమే కాకుండా నష్టపోయామని, సంస్థకు 100శాతం బియ్యం ఇచ్చినా కూడా పెనాల్టీ చెల్లించాలని జిల్లా అధికారులు మౌఖిక ఆదేశాలు జారీ చేస్తూ పెనాల్టీ చెల్లిస్తేనే 2024 వానాకాలం ధాన్యం అలాట్‌మెంట్ జారీ చేస్తామంటున్నారని పేర్కొన్నారు. పెనాల్టీ తో రోడ్డున పడతామని, 25 శాతం పెనాల్టీని రద్దు చేయాలని మంత్రి ద్వారా ప్రభుత్వాన్ని కోరారు.


మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

స్వగ్రామానికి చేరిన వలస జీవి మృతదేహం


చంద్రయ్య(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, జూన్ 21: ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన శీతాల చంద్రయ్య(55) మాల్దీవుల దేశంలో ఈ నెల 17న ప్రమాదవశాత్తు మృతి చెందడంతో ఆయన మృతదేహం శుక్రవారం ఇల్లు చేరింది. కుటుంబ పెద్ద విగత జీవిగా శవ పేటికలో చేరుకోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా రోధించారు. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం మేరకు.. గ్రామంలోని చంద్రయ్య ఉన్న ఊరిలో ఉపాధి లేక గత 20 ఏళ్లుగా ముంబాయికి వలస వెళ్లాడు. అక్కడ అఫ్గాన్ కంపెనీలో పనులు చేస్తు జీవిస్తుండేవాడు. ఈ క్రమంలో అదే కంపెనీ మాల్దీవుల దేశంలో వంతెన నిర్మాణ పనులను చేపడుతోంది. దాంతో రెండేళ్ల కిందట చంద్రయ్య మాల్దీవుల దేశానికి వెళ్లాడు. నెల రోజుల కిందట అతని సోదరుడు నర్సయ్య అనారోగ్యంతో చనిపోయాడు. స్వగ్రామానికి వచ్చిన చంద్రయ్య అంత్యక్రియలు నిర్వహించి 15 రోజుల పాటు ఉండి తిరిగి పయనమయ్యాడు. ఈ నెల 17న వంతెన పనులు చేస్తున్న క్రమంలో రెండు క్రేన్ల మధ్య చిక్కుకుని చనిపోయాడు. నాలుగు రోజులకు చంద్రయ్య మృతదేహం ఇల్లు చేరడంతో కుటుంబ సభ్యుల రోధనలు మిన్నంటాయి. నెల రోజుల వ్యవధిలోనే ఇద్దరు అన్నదమ్ములు చనిపోవడంతో ఆ కుటుంబంలో విషాదం అలుముకుంది. మృతుడికి భార్య పోశవ్వ, వివాహమైన కూతురు భాగ్యలక్ష్మీలు ఉన్నారు. కాగా బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

ఆర్థిక ఇబ్బందులతో రైల్వే ఉద్యోగి ఆత్మహత్య


సీవీ శ్రీనివాస్(ఫైల్)

అంతర్గాం, జూన్ 21: రామగుండం పట్టణంలోని రైల్వేకాలనీకి చెందిన రైల్వే ఉద్యోగి సీవీ శ్రీనివాస్ ఆర్థిక ఇబ్బందులతో శుక్రవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రామగుండం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సీవీ శ్రీనివాస్ 30ఏళ్లుగా రామగుండం రైల్వే సీఅండ్‌డబ్ల్యూ డిపోలో పని చేస్తున్నాడు. పిల్లల ఉన్నత చదువుల కోసం అప్పులు చేసిన శ్రీనివాస్ ఇటీవల కాలంలో ఆర్థిక ఇబ్బందులతో సతమతవుతున్నాడు. దీంతో మనస్తాపం చెంది ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీవీ శ్రీనివాస్ గతంలో వివిధ పత్రికలకు కథనాలను కూడా రాశారు. ఈ నేపథ్యంలో శ్రీనివాస్ మృతి వార్త తెలిసిన పలువురు పాత్రికేయులు మృతదేహానికి నివాళులర్పించారు. సీవీ శ్రీనివాస్‌కు భార్య అరుణ, కుమారుడు, కూతురు ఉన్నారు. మృతదేహానికి పంచనామా నిర్వహించిన రామగుండం ఎస్‌ఐ సతీష్ కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇసుక అక్రమ నిల్వలపై దాడులు

- స్వాధీనం చేసుకున్న అధికారులు
- టెండర్ నిర్వహిస్తామని వెల్లడి

కోరుట్ల, జూన్ 21: మండలంలోని నాగులపేట గ్రామంలో అక్రమ నిలువలపై మైనింగ్, రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించారు. గ్రామ శివారులోని వ్యవసాయ క్షేత్రాలు, మామిడి తోటలతో పాటు గ్రామంలోని పలు చోట్ల ఉన్న అక్రమ ఇసుక నిలువలను గుర్తించిన అధికారులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలోని వివిధ ప్రాంతాలలో 168 ఇసుక కుప్పలు ఉన్నట్లు గుర్తించారు. గ్రామం నుంచి కోరుట్ల పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు ఈ గ్రామం నుంచి భారీగా అక్రమంగా ఇసుక తరలిస్తుంటారు. ఇసుక నిలువలు ఉన్నట్లు మైనింగ్ అధికారులకు పిర్యాదు చేయగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మైనింగ్ అధికారి తిరుపతి రావు ఆధ్వర్యంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌రావు పోలీసుల సహాయంతో దాడులు చేశారు. త్వరలో ఇసుకను టెండర్ వేయనున్నట్లు అధికారులు తెలిపారు.


అక్రమంగా నిల్వ చేసిన ఇసుక

తప్పుడు పత్రాలతో భూ కబ్జా

- ఐదుగురిపై కేసు నమోదు
- ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన

రాయికల్, జూన్ 21: రాయికల్ పట్టణంలో తప్పుడు పత్రాలతో భూమిని కబ్జా చేసిన ఐదుగురిపై కేసు నమోదైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రాయికల్ మండలం వస్తాపూర్ గ్రామానికి చెందిన అనుపట్ల శ్రీనివాస్, అనుపట్ల పోచయ్యలు అన్నద మ్ములు కాగా, శ్రీనివాస్‌కు కుమారుడు ప్రశాంత్, భార్య లక్ష్మి ఉన్నారు. పోచయ్యకు సంతానం లేకపోవడంతో మేన కోడలు బూర్గుల శారదను పెంచుకున్నాడు. శ్రీనివాస్ 2010 లో రాయికల్ పట్టణంలో సర్వే నెం.1057/ఇ లో 637 చదరపు గజాల భూమిని కొనుగోలు చేశాడు. 2010, డిసెంబరు 10న అనారోగ్యంతో శ్రీనివాస్ మృతి చెందగా, అప్పటి నుంచి లక్ష్మి, తన కుమారుడు ప్రశాంత్‌తో కలిసి కొడిమ్యాల మండలం పూడూర్‌లో నివాసముం టుంది. కొన్ని సంవత్సరాలుగా శ్రీనివాస్ కుటుంబసభ్యులు రాయికల్‌కు రాకపోవడంతో భూ మిని సొంతం చేసుకోవాలని బూర్గుల శారద మరికొందరి సహకారంతో 2017లో జగిత్యాల మున్సిపాలిటీ నుంచి లక్ష్మి మృతి చెందినట్లు మరణ ధృవీకరణ పత్రం రాయికల్ తహసీ ల్దార్ కార్యాలయం నుంచి జారీ చేసినట్లు శ్రీనివాస్ వారసురాలిగా శారద అని తప్పుడు కు టుంబసభ్యుల ధృవీకరణ పత్రాలు సృష్టించారు. ఈ ఆధారాలతో జనవరి 5, 2024న డాక్యు మెంట్ నెం.106/2024, 107/2024 కట్కం సాయి కుమార్, అనుపట్ల పోచమ్మలకు రిజిస్ట్రేష న్ చేశారు. మారంపల్లి రవి కుమార్, పడిగెల నర్సింహా సాక్ష్యులుగా సంతకాలు చేశారు. ఈ పత్రాలతో భూమిని కబ్జా చేశారు. విషయం తెలుసుకున్న అనుపట్ల శ్రీనివాస్, భార్య లక్ష్మి, కుమారుడు ప్రశాంత్ తమ భూమి కబ్జాకు గురైందని ఆధారాలు సేకరించి రాయికల్ పోలీ స్స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, బూర్గుల శారద, అనుపట్ల పోచమ్మ, కట్కం సాయి కుమార్, మారంపెల్లి రవి కుమార్, పడిగెల నర్సింహా అనే ఐదుగురు వ్యక్తులపై ఈ నెల 8న కేసు నమోదైంది. తమ భూమిని తప్పుడు పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేసుకున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు

భూ తగాదాలతో వ్యక్తి ఆత్మహత్య

ఇల్లంతకుంట, జూన్ 21: మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో భూ తగాదాతో గంద్ర నర్సింగరావు (65) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. నర్సింగరావుకు తన అన్న గంద్ర సూర్యారావు, బోయినిపల్లి నర్సింగరావుకు మధ్య భూతగాదా ఏర్పడింది. సమస్య పరిష్కారం కాకపోవడంతో మనస్తాపం చెందాడు. బుధవారం ఇంట్లో పరుగుల మంది తాగి అపస్మారకస్థితికి చేరుకోగా ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ గురువారం అర్ధరాత్రి మృతిచెందాడు. బంధువుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్, ఎస్సై రాజుగౌడ్ తెలిపారు.

దాడి ఘటనలో ముగ్గురిపై కేసు

ఎల్లారెడ్డిపేట, జూన్21: దాడి ఘటనలో ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన చింతకింది భాను, నిఖిల్, మరో యువకుడిపై కేసు నమోదు చేశామని స్టేషన్ హౌస్ అధికారి కిషన్‌రావు శుక్రవారం తెలిపారు. మండల కేంద్రంలోని కులేరి దీప్తి కుమార్ తన ఇంటికి వెళ్తున్న దారిలో ముగ్గురు యువకులు మూత్ర విసర్జన చేశారని పేర్కొన్నారు. దారిలో మూత్ర విసర్జన చేస్తే ఎలా అని ప్రశ్నించినందుకు దీప్తి కుమార్‌పై భాను, నిఖిల్, మరో యువకుడు దాడి చేశారని చెప్పారు. అక్కడే ఉన్న బీరు సీసాతో కొట్టి చంపి వేస్తామని హెచ్చరించినట్లు పేర్కొన్నారు. బాధితుడు దీప్తి కుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా నాకా బందీ

- అసాంఘిక శక్తుల కట్టడే ధ్యేయం
- ఎస్పీ అఖిల్ మహాజన్


సిరిసిల్లలో వాహనాలు తనిఖీచేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, జూన్ 21: శాంతిభద్రతల పర్యవేక్షణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా పోలీసులు నాకాబందీ నిర్వహించారు. అసాంఘిక శక్తులు, అనుమానిత వ్యక్తులను కట్టడిచేసేందుకే జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు చేపట్టామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శుక్రవారం సాయంత్రం సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తా, రగుడు చౌరస్తాలో ఎస్పీ అఖిల్ మహాజన్ వాహనాలను తనిఖీ చేశారు. జిల్లాలోకి వచ్చే అన్ని దారులలోనూ, మండల కేంద్రాల్లోనూ పోలీసు అధికారులు, సిబ్బంది ఏకకాలంలో ముమ్మర తనిఖీలు చేపట్టారు. ధ్రువపత్రాలు, నంబర్లు ప్లేట్లు లేని వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు తనిఖీలు నిర్వహించామన్నారు. ప్రజల్లో భద్రతా భావాన్ని కల్పించడమే లక్ష్యమన్నారు. జిల్లాలో ఎవరైనా అనమానాస్పదంగా తిరిగితే డయల్ 100కు లేదా సమీపంలో ఉన్న పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్ పాల్గొన్నారు.

పీహెచ్‌డీ నోటిఫికేషన్ విడుదల చేయాలి

గణేశ్‌నగర్, జూన్ 21: పీహెచ్‌డీ నోటిఫికేషన్ విడుదల చేయాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) శాతవాహన యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో ఎస్‌యూ రిజిస్టర్‌కు శుక్రవారం వినతిపత్రం ఆందజేశారు. ఈ సందర్భంగా వర్కింగ్ కమిటీ మెంబర్ జెల్లపల్లి అంజన్న మాట్లాడుతూ పీహెచ్‌డీ నోటిఫికేషన్ ఇవ్వని కారణంగా ఎంతో మంది విద్యార్థులు చదువులకు దూరం అవుతున్నారని ఆన్నారు. వెంటనే పీహెచ్‌డీ నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. యూజీసీ నెట్, సెట్, జేఆర్‌ఎఫ్, అర్హత సాధించిన విద్యార్థులు ఎంతోమంది నోటిఫికేషన్ లేక కూలి పనులు చేసు కుంటున్నారని దీని వెంటనే గ్రహించి నోటిఫికేషన్ వచ్చేలాగా చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా కన్వీనర్ విష్ణు, పీజీ విద్యార్థులు మహేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


ఎస్‌యూ రిజిస్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

పోగొట్టుకున్న బంగారు ఆభరణాలు అప్పగింత


తోట లక్ష్మికి బంగారు ఆభరణాలు అప్పగిస్తున్న డీఎం నాగభూషణం

కళ్యాణ్‌నగర్, జూన్ 21: గోదావరిఖని బస్‌లో ఈనెల 19న బంగారు ఆభరణాలు మరిచిపోయిన ప్రయాణికురాలు తోట లక్ష్మికి రూ.7లక్షల విలువైన బంగారు ఆభరణాలను శుక్రవారం ఆర్టీసీ డీఎం నాగభూషణం డిపోలో అప్పగించారు. గోదావరిఖని డిపోకు చెందిన టీజీ22జెడ్ 0013 ఎక్స్‌ప్రెస్ బస్సు సికింద్రాబాద్ నుంచి గోదావరిఖనికి వస్తుండగా సుల్తానాబాద్ వద్ద బస్సులో ఒక చేతి సంచిని గమనించిన కండక్టర్ శ్రీనివాస్ అందులో బంగారు ఆభరణాలు ఉన్నట్టు గుర్తించి డిపోకు వచ్చిన తరువాత అధికారులకు అప్పటించారు. రూ.7లక్షల విలువ చేసే 89గ్రాముల బంగారాన్ని ఓదెల మండలం కొలనూరు గ్రామానికి చెందిన తోట లక్ష్మి అనే ప్రయాణికురాలివి గుర్తించారు. తగిన ఆధారాలతో డిపో అధికారులను సంప్రదించగా తిరిగి ఆ బంగారు ఆభరణాలు తోట లక్ష్మికి డీఎం నాగభూషణం అప్పగించారు. నిజాయితీగా ఆభరణాలు అప్పగించిన కండక్టర్ శ్రీనివాస్‌ను లక్ష్మి కుటుంబ సభ్యులు, తోటి కండక్టర్లు, డ్రైవర్లు అభినందించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ గీత కృష్ణ, డిప్యూటీ సూపరింటెండెంట్ సదానందం, సెక్యూరిటీ సిబ్బంది సత్యనారాయణ, అఖిల తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గీత కార్మికుడు మృతి

ముస్తాబాద్, జూన్ 21: ముస్తాబాద్ మండలం చిప్పలపల్లికి చెందిన కంచర్ల దేవయ్యగౌడ్ తాటి చెట్టు పైనుంచి పడి తీవ్రగాయాలకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. గ్రామానికి చెందిన దేవయ్యగౌడ్ కులవృత్తి చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఫిబ్రవరి 28వ తేదీన వృత్తిలో భాగంగానే తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా మోకు తెగిపోవడంతో కింద పడి తీవ్రగాయాలకు గురయ్యారు. గమనించిన కార్మికులు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నాలుగు నెలల తరువాత మృతి చెందాడు.

బావిలో పడి కూలీ మృతి

ధర్మపురి, జూన్ 21: మండలంలోని దమ్మన్నపేట గ్రామంలో శివరాత్రి మహేష్(25) అనే కూలీ వ్యవసాయ బావిలో పడి శుక్రవారం మృతి చెందాడు. గ్రామంలో జక్కుల రాజన్న అనే వ్యక్తి వ్యవసాయ బావి చుట్టూ తెట్టె కట్టే కూలి పనికి మహేస్ వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడగా ఈత రాకపోవడంతో నీటిలో మునిగి మృతి చెందాడు. మృతుడి తండ్రి శివరాత్రి ఎల్లయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు.

దొంగల బీభత్సం

తంగళ్లపల్లి, జూన్ 21: దేశాయపల్లె మల్లాపూ ర్‌లో శుక్రవారం తెల్లవారుజామున దొంగలు బీభత్సం సృష్టించారు. మల్లాపూర్‌లో ఇంటి ఆవరణలో నిద్రిస్తున్న బాస ఎల్లవ్వ మెడలో మూ డు తులాల పుస్తెల తాడు ఎత్తుకెళ్లారు. అదే గ్రామానికి చెందిన తాటిపల్లి బాలకిషన్, ఎడ్ల రమేష్‌కు చెందిన రెండు సెల్ ఫోన్లు దొంగి లించారు. దేశాయిపల్లెకి చెందిన పర్శరాములు ఇంటి తాళం పగలగొట్టి రూ.4 వేల ఎత్తుకెళ్లారు. డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, ఎస్సై సుధాకర్ సంఘటన స్థలాలను పరిశీలించారు.

రూ.7,350 పలికిన పత్తి ధర

జమ్మికుంట, జూన్ 21: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,350 రూపాయలు పలికింది. శుక్రవారం మార్కెట్ యార్డుకు 22మంది రైతులు 338క్వింటాళ్ల విడి పత్తి, నలుగురు రైతులు నాలుగు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,350, కనిష్ఠ ధర 6,500 రూపాయలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘన నివాళి



నివాళి అర్పిస్తున్న సెస్ చైర్మన్, బీఆర్ఎస్ నాయకులు



నివాళులు అర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సిరిసిల్ల, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని సిరిసిల్లలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు తెలిపారు. జయశంకర్ ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగాలన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన పాత్రను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, గన్‌రాజ్, కుంబాల మల్లారెడ్డి, గజభీంకార్ రాజన్న, మాట్లమధు, కుందుకూరి రామగౌడ్, మునిగెల రాజు, చిరంజీవి, జక్కుల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల రూరల్: సిరిసిల్ల పట్టణంలోని గాంధీచౌక్‌లో శుక్రవారం మానేరు రచయితల సంఘం ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి నిర్వహించారు. అఖిల భారతతెలంగాణ రచయితల వేదిక అధ్యక్షుడు జూకంటి జగన్నాథం, కార్యక్రమంలో మానేరు రచయితల సంఘం అధ్యక్షుడు టీవీ నారాయణ, ప్రధాన కార్యదర్శి ఆడెపు లక్ష్మణ్, ఎలగొండ రవి, బూర దేవానందం, అంకారపు రవి, దూడం గణేష్, వంశీ, వెంగళ లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట : మండల కేంద్రంలోని జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ చిత్ర పటానికి పూల మాలలు వేశారు. జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ రేణుక, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, మండల కో-ఆప్షన్ సభ్యుడు జబ్బార్, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

వేములవాడ టౌన్: ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా వేములవాడ పట్టణంలోని తెలంగాణ చౌక్ వద్ద బీఆర్ఎస్ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కౌన్సిలర్లు మారం కుమార్, సిరిగిరి చందు, నిమ్మశెట్టి విజయ్ నాయకులు రామతీర్థపు రాజు ఉన్నారు. పట్టణంలోని ద్వారకనగర్‌లోని శ్రీరాజరాజేశ్వర కార్పెంటర్స్ సేవ్స్ సొసైటీ ఆధ్వర్యంలో జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆంజనేయులు, సత్యం, శ్రీధర్, శంకరయ్య, నాగభూషణం ఉన్నారు.



సిరిసిల్లలో నివాళి అర్పిస్తున్న నాయకులు



యోగాసనాలు వేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత

ఘనంగా యోగా దినోత్సవం

సిరిసిల్ల, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సిరిసిల్లలోని ఇందిరా పార్కులో ఆయుష్, యోగా సాధన సమితి, ఆధ్వర్యంలో వేడుకలు చేపట్టారు. అధికారులు, యోగా అభిమానులు, ఆసనాలు వేశారు.మున్సిపల్ కమిషనర్ లావణ్య, వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, ఆయుష్ నోడల్ అధికారి డాక్టర్ నీరజ, యువజన, క్రీడా శాఖ అధికారి రాందాస్, పతంజలి యోగా సమితి అధ్యక్షుడు అడెపు రవీందర్, శ్రీకాంత్, శ్రీనివాస్ ఆయుష్ సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నాకోసం మరియు సమాజం కోసం యోగా అనే థీమ్‌తో సిరిసిల్ల, పెద్దూర్, తంగళ్లపల్లి కస్తూర్బాగాంధీ పాఠశాలల్లో వేడుకలు నిర్వహించారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుమన్‌మోహన్, నోడల్ అధికారి డాక్టర్ రజిత, డాక్టర్ నయూమా, డాక్టర్ స్నేహ, డాక్టర్ షేక్ గౌస్ బాషా, డాక్టర్ కృష్ణవేణి, డీపీవో ఉమ, లింగం పాల్గొన్నారు.

సిరిసిల్ల క్రైం: రోగ నిరోధకశక్తిని పెంపొందించేందుకు యోగా ఎంతో ఉపయోగపడుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.ప్రేమలత అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో యోగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగా ఆరోగ్యంతో మానసిక ఉల్లాసాన్ని ఇస్తుందన్నారు. ఎస్ఎస్‌వై ఆధ్వర్యంలో వివిధ రకాల యోగాసనాలు వేశారు. సీనియర్ సివిల్ జడ్జి రాధిక జైస్వాల్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి సృజన, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డార్నాల లక్ష్మారెడ్డి, కార్యదర్శి వెంకటి, ట్రెజరర్ బిట్ల విష్ణు, న్యాయవాదులు పాల్గొన్నారు.

● యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యం సొంతమవుతుందని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శుక్రవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణంలోని బతుకమ్మ ఘాట్ వద్ద అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా నిత్యం బిజీ బిజీగా ఉండే అధికారులు, సిబ్బంది యోగాతో ఆరోగ్యంపై పట్టుసాధించవచ్చన్నారు. యోగా శిక్షకులతో కలిసి యోగాసనాలు వేశారు. అదనపు ఎస్పీ చంద్రయ్య, సిరిసిల్ల, వేములవాడ డీఎస్పీలు చంద్రశేఖర్‌రెడ్డి, నాగేంద్రచారి, సీఐలు సదన్‌కుమార్, అనిల్ కుమార్, మధుకర్, ప్రవీణ్‌కుమార్, శ్రీలత, ఆర్ఐలు యాదగిరి, మధుకర్; రమేశ్, యోగా గురువు శ్రీనివాస్ పాల్గొన్నారు.

సిరిసిల్ల రూరల్: మనిషి మానసిక ఒత్తిడిని జయించడానికి యోగా దోహదపడుతుందని సిరిసిల్ల 17వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ శ్రీనివాసరావు అన్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని సర్దాపూర్‌లోని 17వ పోలీస్ బెటాలియన్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. పోలీస్ బెటాలియన్ కమాండెంట్ శ్రీనివాస్‌రావు పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి యోగా ఆసానాలు వేశారు. అసిస్టెంట్ కమాండెంట్ రాందాస్, అధికారులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండంలోని పలు గ్రామాలలో ప్రపంచ యోగాదినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. అనంతారం గ్రామంలోని ఉపాధిహామీ పనుల వద్ద, ఇల్లంతకుంటలో వాణీ



సిరిసిల్ల ఇందిరాపార్కులో యోగా దినోత్సవం

నికేతన్ హైస్కూల్‌లో యోగా వేడుకలు చేపట్టారు. ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, ఏపీవో చంద్రయ్య, పాఠశాల కరస్పాండెంట్ తూముకుంట శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనిధి పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు గ్రామాల్లోని పాఠశాలలు, కళాశాలలు, వృద్ధుల డే కేర్ సెంటర్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు.



యోగాసనాలు వేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

వృద్ధులు, విద్యార్థులతో ఆసనాలు వేయించారు. వివిధ పాఠశాలల హెచ్ఎంలు, నాయకులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: మండలంలోని ఆవునూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి: యోగాతో మానసిక ఒత్తిళ్లు దూరం అవుతాయని యోగా గురువు మధు అన్నారు. చందుర్తి మండలం మల్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ యోగా దినోత్సవం స్వామి వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో ఆసనాలు వేశారు. సమితి సభ్యులు మధుసూదన్, సుధాకర్, రాజు, ముకేష్, సతీష్ పాల్గొన్నారు.

రుద్రంగి: మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. పిన్సిపాల్ హరినాథ్ రాజు, కరస్పాండెంట్ ఎలిగేటి నరేష్, డైరెక్టర్‌లు తిపిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎర్రం గంగనర్సయ్య, పడాల సురేష్ పాల్గొన్నారు.

వేములవాడలో భారీ వర్షం

వేములవాడ టౌన్, జూన్ 21 : వేములవాడ పట్టణంలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. పట్టణంతోపాటు మండలంలోని ఆరెపల్లి, గొల్లపల్లి, సంకెపల్లి, రుద్రవరం, తిప్పాపూర్, మారుపాక, చింతలఠాణ గ్రామాల్లో వర్షం కురువడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. పత్తి విత్తనాలు నాటి ఎదురు చూస్తున్న తరుణంలో వర్షం కురువడంతో అనందం వ్యక్తం చేస్తున్నారు. వేములవాడ పట్టణం కురిసిన వర్షానికి జాత్రాగ్రౌండ్ ఏరియాలోని రోడ్డుపై నీళ్ల నిలిచాయి. రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులు వర్షానికి తడిసి ముద్దయ్యారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు ఎంపిక

చందుర్తి, జూన్ 21: చందుర్తి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్రంలోని స్పోర్ట్స్ స్కూల్స్‌లో 4వ తరగతిలో ప్రవేశాల కోసం ఎంపిక చేయనున్నట్లు ఎంఈవో శ్రీనివాస్ దీక్షితులు శనివారం తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో సోమవారం ఉదయం 9.30 గంటలకు ఎంపిక ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు చందుర్తి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకర్‌తోపాటు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులను సంప్రదించాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

ఇల్లంతకుంట, జూన్ 21: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందని ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్యయాదవ్, ప్రధానోపాధ్యాయిని శారద, కూనబోయిన బాలరాజు, వరుణ్, పద్మ పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణ పనులను ప్రారంభించాలి

ఎల్లారెడ్డిపేట, జూన్ 21: ఆలయ పునర్నిర్మాణ పనులకు టెండర్‌ను ఆహ్వానించి పనులను త్వరగా ప్రారంభించాలని ఆలయ కమిటీ సభ్యులు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయ పునః నిర్మాణ పనులను చేపట్టాలని కోరుతూ సభ్యులు శుక్రవారం హైదరాబాద్‌లోని దేవాదాయ శాఖ అధికారులను కలిశారు. ఆలయ పునః నిర్మాణానికి టీటీడీ శ్రీవాణి ట్రస్టు ద్వారా మంజూరైన రూ.1.80 కోట్లతో పనులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారని సభ్యులు తెలిపారు. కమిటీ చైర్మన్ ఈశ్వర్, వైస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, సలహాదారులు కిషన్, లక్ష్మారెడ్డి, నర్సింలు ఉన్నారు.

లింగాపూర్‌లో పలువురికి కేటీఆర్ పరామర్శ

గంభీరావుపేట, జూన్ 20: గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్ గ్రామంలో మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు శుక్రవారం పలువురిని పరామర్శించారు. బీఆర్ఎస్ నాయకులు మల్లవరం సదాశివరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని కేటీఆర్ పరామర్శించారు. సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి కుమారుడు మనిదీప్‌రెడ్డి ఇటీవల మృతి చెందగా, కేటీఆర్ వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. అంతకుముందు బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి చిలువేరు రాకేష్ దంపతులను కేటీఆర్ ఆశీర్వదించారు. ఆయన వెంట బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సెస్ డైరెక్టర్ నారాయణరావు, సింగిల్‌విండో వైస్ చైర్మన్ రామాంజనేయులుగౌడ్, మాజీ సర్పంచ్ రాజిరెడ్డి, నాయకులు లక్ష్మణ్, సదాశివరెడ్డి, కమ్మరీ రాజారాం, శేఖర్‌గౌడ్, ఎర్ర ఎల్లాగౌడ్, మహేందర్‌రెడ్డి, మహేష్, బలరాంగౌడ్, రాములు, లక్ష్మినర్సింలు, బాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యార్థుల సంఖ్యను పెంచాలి

వీర్నపల్లి, జూన్ 21 : వీర్నపల్లి మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కమిటీ సభ్యులు కోరారు. వీర్నపల్లి మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శి పురుషోత్తం అధ్యక్షతన గ్రామసభను నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలో ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలకు చోటు లేదని పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు పర్మిషన్ ఇవ్వద్దన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కమిటీ సభ్యులు అరుణ్ కుమార్, లెంకల లక్ష్మణ్, భగవంతం, రాజు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు వైద్య పరీక్షలు

వేములవాడ టౌన్, జూన్ 21 : వేములవాడ మున్సిపల్ కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యలయంలో సీఎస్సీ హెల్త్‌కేర్ ఆధ్వర్యంలో చర్మవ్యాధులు, ఊపిరితిత్తులు, కిడ్నీ, గుండె, మధుమేహం, థైరాయిడ్‌తోపాటు పలు రకాల వైద్య పరీక్షలు చేశారు.

ఘనంగా గంగమ్మ బోనాలు

రుద్రంగి, జూన్ 21: రుద్రంగి మండల కేంద్రంలో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో గంగమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. మహిళలు అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు దేశవేణి దర్మెందర్, చిట్టపురం భూమయ్య సిరికొండ రవీందర్, ద్యావల గణేష్, ఎల్ల గంగాధర్, ఆర్మూర్ గంగాదర్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కోనరావుపేట, జూన్ 21 : పేదరికంలో ఉన్న ఓ మహిళ గుండె శస్త్ర చికిత్స కోసం ప్రస్తుత సహాయం కింద ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆర్థిక సహాయాన్ని సమకూర్చగా మండల కాంగ్రెస్ నాయకులు ఆ కుటుంబానికి అందజేశారు. కోనరావుపేట మండలం నిమ్మపల్లికి చెందిన డప్పుల రాజవ్వ గుండెకు ఆపరేషన్ చేయాలని వైద్యులు తెలిపారు. కుటుంబం గడవడమే కష్టంగా ఉండడంతో రూ.20,000 ఖర్చులకోసం శుక్రవారం మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా ఆ కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు శ్రీనివాస్, మానుక సత్యం తదితరులు ఉన్నారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

బోయినపల్లి, జూన్21: వివిధ పంటలకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించడంపై బోయినపల్లి మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ బోయినపల్లి మండల అధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గుడి రవీందర్ రెడ్డి, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి ఎడపల్లి పరశురాములు, బీజేపీ మండల కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు అమిరిశెట్టి గంగయ్య, దళిత మోర్చా మండల అధ్యక్షుడు సుంకపాక ప్రభు, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు బొంగాని అశోక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లో భద్రతాభావం కల్పించేందుకు నాకాబందీ

వేములవాడ టౌన్, జూన్ 21 : ప్రజల్లో భద్రతా భావం కల్పించడం కోసమే నాకాబందీ చేపట్టినట్లు ఎస్పీ అఖిల్‌మహాజన్ అన్నారు. వేములవాడ మున్సి పల్ పరిధిలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట పోలీసులు శుక్రవారం నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ వాహనాల తనిఖీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పర్యవేక్షణలో భాగంగా కార్యక్రమం నిర్వహించామని అన్నారు. అపరిచిత, అనుమానిత వ్యక్తులు, అనుమానిత వస్తువులను గుర్తించేందుకు వీలు ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ వీరప్రసాద్ తదితరులు ఉన్నారు.



వాహనాల తనిఖీని పరిశీలిస్తున్న ఎస్పీ

ఇల్లంతకుంట: మండలకేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో ఎస్సై రాజుగౌడ్ ఆధ్వర్యంలో గురువారం నాకాబందీ నిర్వహించారు. వాహనాలను తనిఖీలు చేయడంతోపాటు సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుండా వాహనాలు నడుపుతున్నవారి వివరాలు తీసుకున్నారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్ ఎదుట శుక్రవారం పోలీసులు వాహన తనిఖీలను ముమ్మరం చేశారు. ప్రతీ వాహనాన్ని ఆపి సోదాలు నిర్వహించారు. ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలను సీజ్ చేశారు. డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు.

వీర్నపల్లి: వీర్నపల్లి మండల కేంద్రంలో నాకాబందీ నిర్వహించి వాహనాల తనిఖీ చేపట్టినట్లు ఎస్సై రమేష్ తెలిపారు. ప్రతి వాహనదారుడు సరైన ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలన్నారు. ఏఎస్ఐ రాజిరెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీల బలోపేతానికి కృషి చేయాలి

జగిత్యాల, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మార్గదర్శకాలను ఎప్పటి కప్పుడు పాటిస్తూ అంగన్ వాడీల బలోపేతానికి టీచర్లు కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. శుక్రవారం పట్టణంలోని కలెక్టరేట్ కార్యాలయంలో అంగన్ వాడీ టీచర్లకు జాతీయ నూతనం విద్యా విధానం అనుస రించి తయారు చేసిన మూల్యాంకన పుస్తకాలను అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. అవగాహన సమావేశానికి వచ్చిన అదనపు కలెక్టర్ రాంబాబుకు పూలమొక్కను అందించి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మా ట్లాడారు. అంగన్ వాడీ కేంద్రాల్లో ఆటా పాటలతో బోధన జరపాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిని వాణి శ్రీ, కలెక్టర్ కార్యాలయ ఏవో హన్మంతరావు, సీడీపీవోలు వీర లక్ష్మీ, నరసింగ రాణి పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ధర్మపురి ఆలయ ఈవో

ధర్మపురి, జూన్ 21: జగిత్యాల జిల్లా నూతన కలెక్టర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన సత్యప్రసాద్‌ను శుక్రవారం ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలిసి దైవ దర్శనానికి రావాలని కోరుతూ ఆహ్వానిం చా రు. జగిత్యాల కలెక్టర్ కార్యాలయంలో ఉన్న సత్యప్రసాద్‌ను ఉదయం ఈవో శ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలిసి స్వామి శేష వస్త్రం కప్పి సత్కరించి, ప్ర సాదాలు అందించారు. దీంతో సానుకూలంగా స్పందించిన కలెక్టర్ నరసిం హుని దర్శనానికి వస్తానని చెప్పినట్లు ఈవో శ్రీనివాస్ తెలిపారు.

గుడుంబా రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యం

జగిత్యాల టౌన్, జూన్ 21 : జగిత్యాలను గుడుంబ రహిత జిల్లాగా మార్చడమే ప్రధాన లక్ష్యమని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ సత్యనారాయణ అన్నారు. జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో శుక్రవారం ఎక్సైజ్, పో లీస్ శాఖ అధికారుల సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ గుడుంబా తయారీ, విక్రయదారులపై ఉక్కుపాదం మోపాలన్నారు. పోలీస్, ఎక్సైజ్ అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్లి నాటు సారా తయారీ కాకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు. నాటు సారా తయారీకి ఉపయోగించే బెల్లం, పటిక అమ్మేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

హామీలను అమలు చేయాలి

సిరిసిల్ల టౌన్, జూన్ 20: సమ్మె కాలంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎదురుగట్ల మమత డిమాండ్ చేశారు. శుక్రవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో సిరిసిల్ల సీడీపీవో అలేఖ్య పటేల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మమత, నాయకులు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా 24 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేస్తే అంగన్‌వాడీ టీచర్లకు రూ. 18వేలు, హెల్పర్లకు రూ. 18వేలు వేతనం, పదవీవరమణ చేసే టీచర్లకు రూ. 2లక్షలు, హెల్పర్లకు రూ. లక్ష ఇస్తామని హామీ ఇచ్చిందని అన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ కూడా హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పదవీవరమణ చేసే టీచర్లకు కేవలం రూ.లక్ష, హెల్పర్లకు రూ. 50వేలు మాత్రమే



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఇవ్వడానికి జీవో విడదల చేసిందన్నారు. పునః పరిశీలన చేసి ఈ జీవోను రద్దు చేయాలని కోరారు. అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎదురుగట్ల మమత, ఉపాధ్యక్షులు శ్యామల, పద్మ, నాగలక్ష్మి, సహాయ కార్యదర్శులు అంజలి, ఆయేషా, సుధారాణి, కోశాధికారి పద్మ, సభ్యులు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు పాల్గొన్నారు.

వర్షాలు కురవాలి.. పంటలు పండాలి

వేములవాడ టౌన్, జూన్ 21 : వర్షాలు సకాలంలో కురవాలని, పంటలు సమృద్ధిగా పండాలని పెద్దమ్మ తల్లిని వేడుకున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి అన్నారు. వేములవాడ పట్టణంలోని పెద్దమ్మ బోనాల సందర్భంగా అమ్మవారికి మున్సిపల్ కార్యాలయం నుంచి పాలకవర్గం పట్టు వస్త్రాలను తీసుకెళ్లింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపల్ ఆనవాయితీలో భాగంగా ప్రతీ సంవత్సరం లాగనే ఈ సంవత్సరం అమ్మవారికి మున్సిపల్ నుంచి పట్టు వస్త్రాలను తెచ్చినట్లు చెప్పారు. పాడి, పంట, పిల్ల, పాపలు సుఖసంతోషాలతో వర్ధిల్లేలా చూడాలని కోరుకున్నామన్నారు. ప్రజలందరు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, అమ్మవారి దీవేనలు ఆశీస్సులు



అమ్మవారిని దర్శించుకున్న పాకవర్గం సభ్యులు

ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అన్వేష్, వైస్ చైర్మన్ మహేష్, కౌన్సిలర్లు మారం కుమార్, ఇప్పపూల అజయ్, అన్నారం ఉమా, జోగిని శంకర్, రేగుల సంతోష్‌బాబు, నిమ్మశెట్టి విజయ్ తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ పట్టణ మహిళా అధ్యక్షురాలి రాజీనామా

వేములవాడ టౌన్, జూన్ 21 : వేములవాడ పట్టణ బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు గోపన్నగారి మాధవి లత రాజీనామా చేసినట్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షురాలిగా కొంతకాలంగా విధులు నిర్వర్తిస్తున్నట్లు, వ్యక్తిగత కారణాలతో బీఆర్ఎస్ మహిళా పట్టణ అధ్యక్షురాలి పదవికి రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు. లేఖను జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యకు పంపించినట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

వేములవాడ టౌన్, జూన్ 21 : వేములవాడ మండల ఆరెపల్లి గ్రామ శివారులో గురువారం రాత్రి ద్విచక్రవాహనం అదుపుతప్పి గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాల ప్రకారం.. కొదురుపాక బ్రిడ్జి దాటి ఆరెపల్లి గ్రామ సమీపంలో గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన గీకురు జలందర్ (33) అనే యువకుడు ద్విచక్రవాహనంపై వస్తుండగా ప్రమాదవశాత్తు అదుపుతప్పి పడిపోయాడు. ఈ సంఘటనలో జలంధర్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. కాగా కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ఆర్టీసీ బస్సులో మహిళ వీరంగం

వేములవాడ టౌన్, జూన్ 21 : ఆర్టీసీ బస్సులో ఓ మహిళ వీరంగం సృష్టించిన సంఘటన వేములవాడలో శుక్రవారం చోటు చేసుకుంది. ఆర్టీసీ అధికారుల వివరాల ప్రకారం.. గుర్తు తెలియని ఓ మహిళ వేములవాడ బస్టాండ్‌లో సిద్దిపేట వెళ్తున్న బస్సులో ఎక్కింది. దీంతో బస్సులో ఉన్న ప్యాసింజర్‌తో గొడవకు దిగడం, టికెట్ తీసుకోవాలని అడిగిన కండక్టర్‌తో దురుసుగా ప్రవర్తించింది. దీంతో డ్రైవర్ బస్సును నిలిపి 100 కి సమాచారం అందించాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు సదరు మహిళ మత్తులో ఉందని గుర్తించి స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లి మాత్రలు వేయించారు. తిరిగి జేబీఎస్ వెళ్లే బస్సు ఎక్కించినట్లు తెలిపారు.

గుండెపోటుతో ఒకరి మృతి

కోనరావుపేట, జూన్ 21 : కోనరావుపేట మండలంలో వట్టిమల్లలో అనుముల రాజేశం(45) అనే లారీ డ్రైవర్ గుండెపోటుతో గురువారం మృతి చెందాడు. వృత్తిలో భాగంగా భద్రాచలం కిరాయి వెళ్లి వచ్చి భోజనం చేసి నిద్ర పోయాడు. నిద్రలో గుండెపోటు మరణించాడు. కాగా కుమారుడు పవన్ రన్నింగ్‌లో గెలుచుకున్న గోల్డ్ మెడల్, సర్టిఫికెట్ తండ్రి గుండెల మీద పెట్టి రోదించడం స్థానికులను కలిచివేసింది.

పాఠశాలల పనులను నాణ్యతతో పూర్తిచేయాలి

జగిత్యాల అర్బన్, జూన్ 21: అమ్మ ఆదర్శ పాఠశాల పాఠశాలలో జరుగు తున్న పనులను నాణ్యతతో పాటు వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ సత్యప్ర సాద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంప్‌లోగల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, పురాణిపేట ప్రభుత్వ పాఠశాల, హన్మాజీపేట ప్రభుత్వ పా ఠశాల, జాబితాపూర్‌లోని జడ్పీహెచ్ఎస్, పెర్కపల్లిలోని ఎంపీఎస్ఎస్ పాఠ శాలలను ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశా లలోని విద్యార్థులతో ముచ్చటించిన ఆయన పుస్తకాలు, నోట్‌బుక్‌లు యూని ఫాంలు పంపిణీ చేశారా లేదా అనే వివరాలతో పాటు విద్యార్థుల అటెండెన్స్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు వందశాతం ప్రగతి సాధించేలా విద్యా బోధనకు కృషి చేయాలన్నారు.

మద్యం దుకాణాల్లో చోరీ

మల్యాల, జూన్ 21: మండలంలోని కొండగట్టు వద్ద పక్కపక్కనే గల రెండు వైన్స్‌లలో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. వైన్స్ పైకప్పు రేకుల తొలగించి లోపలికి వెళ్లిన దొంగలు కౌంటర్లలో గల రూ.35వేల నగదు ఎత్తుకెళ్లినట్లు నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై అబ్దుల్‌రహీం తెలిపారు.

ఫీజుల నియంత్రణ కమిటీలను ఏర్పాటు చేయాలి

కరింనగర్‌టౌన్,జూన్ 21: రాష్ట్ర వ్యాప్తంగా కార్పొరేట్ విద్యా సంస్థలు, ప్రైవేట్ విద్యాసంస్థలలో ఫీజుల దోపిడీపై ఫీజుల నియంత్రణ కమిటీ ఏర్పాటు చేయాలని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్ఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో స్కూల్ బోర్డ్ అదనపు డైరెక్టర్ కె లింగయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల విద్యాసంస్థలలో ఫీజుల దోపిడీపై స్పందించకుండా నిర్లక్ష్యం వహించారని దాని ఫలితంగా యజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి సంవత్సరం 20 నుంచి 30శాతం ఫీజులు పెంచుకుంటూ విద్యార్థులను తల్లిదండ్రులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఫీజులను అరికట్టడం కోసం గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఈ ప్రభుత్వమైనా తక్షణమే స్పందించి రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో ఫీజు రెగ్యులారిటీ కమిటీలను ఏర్పాటు చేయాలని కోరారు. తక్షణమే విద్యా వ్యాపారంపై రాష్ట్రవ్యాప్తంగా స్పందన రావాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బోర్డ్ ముట్టడికి పిలుపునిస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు చెదలాపురం మధు, రాష్ట్ర నాయకులు బి వెంకట్, వికాస్, జయకృష్ణా ఉన్నారు.

నీట్ పేపర్ లీకేజీపై విచారణ చేపట్టాలి

సిరిసిల్ల రూరల్, జూన్ 21 : నీట్ గ్రేస్ మార్కులు రద్దు చేయడం కాదని, పేపర్ లీకేజీపై విచారణ చేపట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అంగూరి రంజిత్, ఎస్ఎస్‌యూఐ అధ్యక్షుడు వేల్పుల సాయిప్రసాద్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గాంతుల మహేష్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలో శుక్రవారం ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీల పిలుపు మేరకు నీట్ అవకతవకలపై సుప్రీం కోర్టు జడ్జీతో విచారణ చేపట్టాలని, మళ్లీ నీట్ నిర్వహించాలని అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాలకు చెందిన నాయకులు మాట్లాడుతూ మార్కులు మాత్రమే రద్దు చేసి జూన్ 23న రీ ఎగ్జామ్ నిర్వహించి జూన్ 30న ఫలితాలు ఇస్తామని సుప్రీం కోర్టుకు కేంద్రం తెలుపడం కాదని అసలు పేపర్ లీకేజీపై విచారణ జరిపించాలని, రీ ఎగ్జామ్ నిర్వహించడం అంటే నీట్ అవకతవకలు పక్కదారి పట్టించడమే అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వంతోపాటు బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో మాత్రమే నీట్ ర్యాంక్‌లు, పేపర్ లీకేజీ ఆరోపణలు ఉన్నాయన్నారు. సుప్రీం కోర్టు నేతృత్వంలో విచారణ చేపట్టి ఎన్‌టీఏ చైర్మన్, డైరెక్టర్‌ను తప్పించి



నిరసన తెలుపుతున్న నాయకులు

విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మంద అనిల్‌కుమార్, భీమ్ ఆర్మీ అధ్యక్షుడుదొబ్బల ప్రవీణ్‌కుమార్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి కట్కూరి ఎనోష్, లంబాడి ఐక్యవేదిక అధ్యక్షుడు నరేష్ నాయక్, ఎస్ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు అల్లం సాయి, కార్యదర్శి రాంప్రసాద్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జూలపల్లి మనోజ్, కుర్ర రాకేష్, గుండెల్లి కళ్యాణ్, శ్రావణ్‌రామ్ తదితరులు పాల్గొన్నారు.

7 నుంచి నేతన్నల పోరుయాత్ర

సిరిసిల్ల రూరల్, జూన్ 21 : సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించి వస్త్ర పరిశ్రమ సంక్షోభాన్ని నివారించి నేతన్నలందరికి ఉపాధిని రాష్ట్ర ప్రభుత్వం కల్పించాలంటూ సిరిసిల్లలో జూలై 7 నుంచి నేతన్నల పోరుయాత్ర చేపట్టనున్నట్లు సీఐటీయూ పవర్ లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేష్ ప్రకటించారు. సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్ అంభవాని ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం యూనియన్ ఆధ్వర్యంలో నేతన్నల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గత ప్రభుత్వం కొనసాగిన పథకానలు రద్దు చేసిందన్నారు. బతుకమ్మ చీరలు, క్రిస్మస్, రంజాన్ ఇతర ప్రభుత్వానికి అవసరమైన వస్త్రాలను ఉత్పత్తి నిలిపివేయడంతో కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందన్నారు. దానికి తోడు ప్రైవేటు వస్త్రానికి మార్కెట్ లేకపోవడంతో పవర్‌లూం పరిశ్రమకు గుండెకాయ లాంటి కరెంట్ సబ్సిడీ తొలగించడంతో మరమగ్గాలని తుక్కుకింద అమ్మకానికి పెడుతున్నారన్నారు. నేతన్నల గోస ప్రభుత్వానికి కనబడడం లేదన్నారు. జూలై 15న వేలాది మంది నేతన్నలతో హైదరాబాద్ సచివాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు చెప్పారు. రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎగమంటి ఎల్లారెడ్డి, కోడం రమణ, ఎలిగేటి రాజశేఖర్, అసాముల సంఘం అధ్యక్షుడు గొనె పర్శరాములు, నక్కదేవదాస్, సిరిమల్లె సత్యం, కంది మల్లేశం, బూర శ్రీనివాస్, ఆడెపు కనుకరాజు, బెజిగం సురేష్ , కోడం శేఖర్ పాల్గొన్నారు.



సిరిసిల్లలో మాట్లాడుతున్న రమేష్